సాక్షి
ఏలూరు
గురువారం । 16 । నవంబర్ । 2023



అసైన్డ్ రైతులకు మంచి రోజులు
అసైన్డ్, లంక భూముల రైతులకు మంచి రోజులు వచ్చాయి. భూములపై పూర్తి హక్కులతో పత్రాలు అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. 8లో



ఎకో జోన్ పరిధి పెంపు సరికాదు
కొల్లేరు ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని తగ్గించాలని భీమడోలులో జరిగిన అవగాహన సదస్సులో కొల్లేరువాసులు కోరారు. 8లో



గిరిజనుల త్యాగాలు అజరామరం
గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. 8లో

న్యూస్‌రీల్


క్రీడలకు ప్రోత్సాహం



చెస్ విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

గణపవరం: క్రీడలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ స్థాయి చెస్ పోటీల్లో విజేతలకు ఆయన బహుమతులు అందించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో క్రీడల నిర్వహణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని, ప్రతి మండల కేంద్రంలో మినీ స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు చేసిందన్నారు. చదరంగంతో విద్యార్థుల మానసిక వికాశం కలుగుతుందన్నారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలనుంచి 110 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. విజేతలకు ఎమ్మెల్యే వాసుబాబు చేతులమీదుగా షీల్డులు, ప్రశంసా పత్రాలను అందచేశారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి ఆదిరెడ్డి సత్యనారాయణ, కళాశాల అభివృద్ధి కమిటి కార్యదర్శి కాకర్ల శ్రీను, అభివృద్ధి కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సాయంకాలార్చన సమయం మార్పు



ద్వారకాతిరుమల: వృశ్చిక సంక్రమణం (శీతాకాలం) ప్రారంభం కావడంతో శ్రీవారి సాయంకాలార్చన సమయాన్ని ఈనెల 17 నుంచి మార్పు చేస్తున్నట్టు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాధారణంగా రోజూ సాయంత్రం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు చిన వెంకన్నకు సాయంకాలార్చన నిర్వహిస్తారు. అయితే శీతాకాలం కారణంగా ఆ సమయాన్ని సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటలకు మార్పు చేసినట్టు ఈఓ తెలిపారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోల నుంచి పంచారామక్షేత్రాలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్టు ఏలూరు జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి ఎన్వీఆర్ వరప్రసాద్ ఓ ప్రకటనలో కోరారు. అలాగే శ్రీశైలం, అన్నవరం, అరుణాచలం, శబరిమలకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలోని బస్‌స్టేషన్లు, ఆన్‌లైన్, ఆథరైజ్ట్ టికెట్ బుకింగ్ ఏజెంట్ల వద్ద టికెట్లు బుక్ చేసుకోవచ్చని, అలాగే ఒకేచోట 50 మంది లేదా అంతకంటే ఎక్కువ సంఖ్యలో భక్తులు ఉంటే సమీప డిపో మేనేజర్‌ని సంప్రదిస్తే వారు ఎక్కాల్సిన ఊరు నుంచి బస్సులు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు.

అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి కృషి



నరసాపురం రూరల్: రాష్ట్రంలో అగ్నికుల క్షత్రియుల సంక్షేమానికి కృషిచేస్తానని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన మండలంలోని వేములదీవికి చెందిన తిరుమాని నాగరాజు అన్నారు. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు వెలువడినట్టు చెప్పారు. తనపై నమ్మకం ఉంచిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, పార్టీ సంధానకర్త పీడీ రాజుకు కృతజ్ఞతలు తెలిపారు. బీసీలకు పెద్దపీట వేసి పలు పదవులను కట్టబెడుతున్న సీఎం జగన్ వెన్నంటే బీసీ కులాలు ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దొంగ మురళీకృష్ణ పాల్గొన్నారు.

బ్యాండ్ పోటీల్లో ప్రథమం



పెదతాడేపల్లి గురుకుల విద్యార్థుల బృందం

తాడేపల్లిగూడెం రూరల్: పెద తాడేపల్లి బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు స్కాట్లాండ్ బ్యాండ్‌లో రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానం సాధించారు. అన్నమయ్య జిల్లాలోని పుల్లంపేట ఎస్వీబీడీ హైస్కూల్‌లో జరిగిన బ్యాండ్ పోటీల్లో ఈ ఘనత సాధించినట్టు ప్రిన్సిపాల్ బి.రాజారావు బుధవారం తెలిపారు. వచ్చేనెల 3న జోనల్ స్థాయిలో త్రివేండ్రంలో జరుగనున్న పోటీల్లో పాల్గొంటుందన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- 17న నూజివీడుకు సీఎం జగన్ రాక
- తుది దశలో ఏర్పాట్లు
- ఖరారైన పర్యటన షెడ్యూల్
- అసైన్డ్ భూములకు శాశ్వత పట్టాల పంపిణీకి శ్రీకారం
- జిల్లాలో వేలాది మందికి ప్రయోజనం



ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లపై జాయింట్ కలెక్టర్, ఎస్పీలకు సూచనలు చేస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

సాక్షి ప్రతినిధి, ఏలూరు/నూజివీడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనకు నూజివీడు ముస్తాబవుతోంది. శుక్రవారం నూజివీడులో ముఖ్యమంత్రి పర్యటించనున్న నేపథ్యంలో భారీగా స్వాగత ఏర్పాట్లు మొదలు సభా ప్రాంగణం వరకు పనులు చురుగ్గా సాగుతున్నాయి. హెలీప్యాడ్, బహిరంగ సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు ఖరారు చేసి పనులను నిర్వహిస్తున్నారు. 17న ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్ ఖరారు కావడంతో ఏర్పాట్లు తుది దశకు చేరాయి.

అసైన్డ్ భూములకు కొత్త పట్టాలు, అసైన్డ్ 22 (ఎ) భూములకు తొలగించి శాశ్వత పట్టాలు ఇచ్చే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నూజివీడు నుంచి సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించనున్నారు. నూజివీడు-విస్సన్నపేట ప్రధాన రహదారిలోని జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ స్థలంలో బహిరంగ సభా వేదికను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే వేదిక నిర్మాణం, వీఐపీ గ్యాలరీల పనులు పూర్తయ్యాయి. అలాగే మైలవరం రోడ్డులోని పెట్రోల్ బంకు సమీపంలో హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. నియోజకవర్గ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పార్టీ కార్యకర్తలు తరలిరానున్న క్రమంలో ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పార్కింగ్ ప్రాంతాలు కూడా గుర్తించి పూర్తిస్థాయిలో సన్నద్ధం చేశారు. హెలీప్యాడ్ నుంచి రోడ్డు మార్గాన సీఎం జగన్ సభాస్థలానికి చేరుకోనున్నారు. ఈ మార్గాన పార్టీశ్రేణులు పెద్ద ఎత్తున స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నారు.

అధికారులతో కలెక్టర్ సమీక్ష

ముఖ్యమంత్రి సభకు పక్కా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. సభకు హాజరయ్యేవారికి ఎటువంటి ఇబ్బందులకు తావులేకుండా మంచినీటి వసతి, వైద్య సదుపాయం, ఇతర కార్యక్రమాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులంతా మరింత అప్రమత్తంగా వ్యవహరించి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని సూచించారు.

1,376 మంది పోలీసులతో భద్రత

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది మొత్తం 1,376 మందిని నియమించినట్టు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ తెలిపారు. అడిషనల్ ఎస్పీలు ఇద్దరు, డీఎస్పీలు 11 మంది, సీఐలు 32 మంది, ఎస్సైలు 98 మంది, ఏఎస్సైలు, హెడ్‌కానిస్టేబుళ్లు 186 మంది, కానిస్టేబుళ్లు 640 మంది, మహిళా కానిస్టేబుళ్లు 65 మంది, స్పెషల్ పార్టీ సిబ్బంది 274 మంది, హోంగార్డులు 68 మందిని నియమించామన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుతో కలిసి జేసీ బి.లావణ్య వేణి బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్, సభాస్థలి వద్ద వేదిక, ప్రజల కోసం చేసిన ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు సూచనలిచ్చారు. వేదిక సమీపంలో స్టాల్స్‌ను, పలు అభివృద్ధి పథకాలకు సంబంధించి శిలాఫలకాలను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు, వీఐపీ, ప్రజల వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. నూజివీడులో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని, ముఖ్య కూడళ్లలో గట్టి నిఘా ఏర్పాటుచేయాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులను ఆదేశించారు. సభకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు కోరారు. సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ) శ్రీపూజ, డీపీఓ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఏలూరు ఆర్డీఓ ఎస్ఎస్‌కే ఖాజావలి, ఏపీ స్టేట్ కో–ఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

సీఎం పర్యటన ఇలా..

- 17న ఉదయం 10.25 గంటలకు నూజివీడులోని హెలీప్యాడ్‌కు ముఖ్యమంత్రి జగన్ చేరుకుంటారు.
- 10.25 నుంచి 10.35 గంటల వరకు ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో మాట్లాడతారు.
- 10.55 గంటలకు సభాప్రాంగణానికి చేరుకుని వివిధ శాఖలు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ స్టాల్స్, ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తారు.
- 11.10 గంటల నుంచి 12.25 గంటల వరకు అసైన్డ్ పట్టాల పంపిణీ, 22 (ఎ)లో నమోదైన అసైన్డ్ భూములను తొలగించి లబ్ధిదారులకు శాశ్వత పట్టాలు పంపిణీ కార్యక్రమం నిర్వహించి అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారు.
- 12.35 గంటలకు సభా ప్రాంగణం నుంచి బయలుదేరి 12.50 గంటలకు హెలీప్యాడ్ చేరుకుని మధ్యాహ్నం 1.50 గంటల వరకు స్థానిక నాయకులు, ప్రజలను కలిసి 1.55 గంటలకు తాడేపల్లి పయనమవుతారు.

భారీగా తరలి రండి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

సీఎం జగన్ సభకు ప్రజలు పెద్దెత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పిలుపునిచ్చారు. నూజివీడులోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ అసైన్డ్ భూములకు శాశ్వత హక్కు కల్పిస్తూ పట్టాలివ్వడం ద్వారా నూజివీడు నియోజకవర్గంలో 3 వేల మంది పేదలకు లబ్ధి చేకూరుతుందన్నారు. దీంతో నియోజకవర్గ ప్రజలంతా సీఎం జగన్ రాక కోసం ఎదురుచూస్తున్నారన్నారు. సభా వేదిక వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరించి సభా వేదికపైకి ముఖ్యమంత్రి చేరుకుంటారన్నారు. నియోజకవర్గ నలుమూలల నుంచే కాకుండా చింతలపూడి, దెందులూరు, ఎన్టీఆర్ జిల్లాలోని తిరువూరు, మైలవరం, నందిగామ, విజయవాడ సిటీ, కృష్ణా జిల్లాలోని గన్నవరం, గుడివాడ తదితర నియోజకవర్గాల నుంచి సైతం ప్రజలు పెద్దెఎత్తున తరలిరానున్నారని, ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

టిడ్కో ఇళ్లను తాకట్టు పెట్టింది టీడీపీనే

వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి గుడాల గోపి



గోపీని అడ్డుకుంటున్న పోలీసులు

పాలకొల్లు అర్బన్: టిడ్కో లబ్ధిదారులను గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో చంద్రబాబు, పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఎలా మోసం చేశారో లబ్ధిదారులకు వాస్తవాలను వివరిస్తామని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) స్పష్టం చేశారు. ఎమ్మెల్యే నిమ్మల ఆధ్వర్యంలో పాలకొల్లు టిడ్కో గృహాల సముదాయంలో బుధవారం చేపట్టిన వంట వార్పుకి దీటుగా వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి నాయకత్వంలో వాస్తవాల వడ్డన కార్యక్రమాన్ని చేపట్టారు. అయితే పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద పోలీసులు మోహరించారు. ఈ సందర్భంగా గుడాల గోపి విలేకరులతో మాట్లాడుతూ ఏది నిజమో, ఏది అబద్ధమో తేల్చుకోవడానికి ఎమ్మెల్యే నిమ్మల చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే నిమ్మల చదువుకున్న మూర్ఖుడని, టిడ్కో గృహాలను టీడీపీ హయాంలో బ్యాంకులకు తాకట్టు పెడితే.. సీఎం జగన్ బ్యాంకులకు తాకట్టు పెట్టారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నిజాయితీగా పనిచేయడం తమకు అలవాటని, నిజాలను సైతం అబద్ధాలుగా చిత్రీకరించడంలో ఎమ్మెల్యే నిమ్మల పీహెచ్‌డీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో పేదలకు ఇంటి పట్టాలివ్వాలని పాలకొల్లు సమీపంలోని పెంకుళ్లపాడులో 52 ఎకరాలు కొనుగోలు చేశారని, అయితే 2014–19 మధ్య కాలంలో టీడీపీ అధికారంలో ఉండగా టిడ్కో గృహాల పేరుతో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. చదరపు అడుగుకి రూ.950కు పనులు చేయడానికి ప్రముఖ కంపెనీ ముందుకు వస్తే చంద్రబాబు, ఎమ్మెల్యే నిమ్మల కమీషన్లకు కక్కుర్తిపడి ఎల్ అండ్ టీ సంస్థకి చదరపు అడుగుకి రూ.2,150 అప్పగించారని ఆరోపించారు. 20 ఏళ్ల పాటు లబ్ధిదారుల గృహాలను 11 బ్యాంకులకు తాకట్టు పెట్టారని గోపి దుయ్యబట్టారు.

మన్యంలో కేంద్ర బృందం పర్యటన



బుట్టాయగూడెంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

బుట్టాయగూడెం: బుట్టాయగూడెం మండలంలో అభివృద్ధి, సంక్షేమ పథకాల తీరుని అధ్యయనం చేసేందుకు ఆరుగురు సభ్యులతో కూడిన కేంద్ర బృందం బుధవారం మండలంలో పర్యటించింది. దొరమామిడిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, బుట్టాయగూడెంలో సచివాలయాన్ని సందర్శించి పథకాల అమలు తీరు, పారిశుద్ధ్య నిర్వహణ, ఇళ్ల నిర్మాణంపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్థానిక అరుంధతీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కేంద్ర బృందం సభ్యులు రాజేష్, అలోక్ శివమ్, అమృత్, అమిత్, నమోతో పాటు ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.బేబీ సరోజిని, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

స్వమిత్వ సర్వేతో గ్రామీణుల సాధికారత

స్పెషల్ కమిషనర్ సిరి



నూజివీడు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న స్పెషల్ కమిషనర్ సిరి


నూజివీడు: గ్రామీణ ప్రజలకు సాధికారత కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష (స్వమిత్వ) పథకాన్ని తీసుకొచ్చిందని స్వమిత్వ స్పెషల్ కమిషనర్ సిరి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. స్వమిత్వ పథకం ద్వారా జిల్లాలో 547 గ్రామాలను కవర్ చేసి భూమి ఉన్న ప్రతి ఒక్కరికి యాజమాన్యం హక్కు ధ్రువీకరణ పత్రం ఇస్తామన్నారు. స్వమిత్వ వలన ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని, స్థానిక స్థాయిలో ఆస్తి పత్రాల నిర్వహణ, పన్ను వసూలుతో పంచాయతీ రాజ్ సంస్థల ఆర్థిక స్థితిని మెరుగుపరుస్తుందని తెలిపారు. అలాగే స్వమిత్వ సర్వే వలన కలిగే లాభాలను వివరిస్తూ ఆస్తులకు సంబంధించిన వివాదాలు పరిష్కరించబడతాయని, ఇప్పటికే సివిల్ వివాదాలు పరిష్కరించే దిశగా అధిక భారం ఉన్న న్యాయ వ్యవస్థ యొక్క పనిభారాన్ని తగ్గిస్తుందని, గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సామరస్యాన్ని ప్రోత్సహిస్తుందని, చట్టబద్ధమైన ఆస్తి హక్కులు, స్వమిత్వ యాజమాన్య కార్డులను అందించడంతో ఆస్తి మార్కెట్ విలువ కూడా పెరుగుతుందని, ఆస్తి రికార్డులు స్థానిక స్థాయిలో మెరుగైన ప్రణాళికకు తోడ్పడతాయన్నారు. ఈ పథకంలో గ్రామీణ ప్రజల ఆస్తిని ఆర్థిక సంపదగా గుర్తిస్తారని, తద్వారా వారికి బ్యాంకుల్లో రుణాలు పొందడం తదితర ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. స్వమిత్వ ద్వారా గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలతో పాటు ప్రభుత్వ రంగ ఆస్తుల వివరాలను కూడ సరిహద్దులతో సహా నిర్ణయిస్తారన్నారు. ఆస్తిపై చట్టబద్ధ హక్కును కలిగి ఉండటం వల్ల కుటుంబాలలో ఆత్మ విశ్వాసం పెరుగుతుందని అందువలన గ్రామీణ ప్రాంత ప్రజలు అందరు స్వమిత్వ సర్వేకు సహకరించాలని స్పెషల్ కమిషనర్ సిరి విజ్ఞప్తి చేశారు. ఈవోఆర్డీ టి.సరస్వతి, పలువురు ఈవోఆర్డీలు పాల్గొన్నారు.

‘కరోనా’ అడ్వాన్సుల రికవరీకి చర్యలు

- తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలో పంచాయితీ
- స్కామ్ అంటూ ఎల్లోమీడియా తప్పుడు కథనం
- ఖండించిన అధికారులు



తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం



తాడేపల్లిగూడెం: కరోనా కష్టకాలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు విధులు నిర్వర్తించిన సమయంలో ఖర్చుల కోసం అడ్వాన్సులు తీసుకున్న ఉద్యోగులు వారు. రెడ్‌జోన్‌లలో బారికేడ్లు కట్టారు, ఆస్పత్రుల్లో సౌకర్యాలు సమకూర్చారు. బాధితులకు ఉదయం అల్పాహారం నుంచి రాత్రి భోజనం వరకు అన్నీ సమకూర్చారు. జిల్లాకు కరోనా నివారణలో ప్రధాన సేవలు తాడేపల్లిగూడెం కేంద్రంగా సాగాయి. దీంతో ఇక్కడి మున్సిపల్ ఉద్యోగులు కరోనా సేవలను చేశారు. ఖర్చుల కోసం అడ్వాన్సులుగా ఆరుగురు ఉద్యోగులు సొమ్ములను డ్రా చేశారు. అయితే దీనికి సంబంధించిన బిల్లులను సమర్పించలేదు. ఇది సంస్థాపరమైన వ్యవహారం. అంతర్గతంగా జరిగిన తంతు. బాధ్యత తీసుకొని సొమ్ములు డ్రా చేసిన వారు కచ్చితంగా లెక్కలు చెప్పాలి, సంబంధిత బిల్లులు సమర్పించాలి. అడ్వాన్సులను చెల్లించకుండా తప్పించుకొనే వీలులేదు. దీనిపై రికవరీ కోసం ఇటీవల సంబంధిత ఉద్యోగులకు ఇచ్చిన నోటీసులను ఆధారంగా చేసుకొని పచ్చమీడియా తప్పుడు కథనాలతో ప్రచారం సాగిస్తోంది. ప్రతిపక్షాలు వంత పాడుతున్నాయి.

తీసుకున్న సొమ్ములు రూ.47 లక్షల పైనే

ఆరుగురు మున్సిపల్ ఉద్యోగులు రూ.47,15,039 అడ్వాన్సులుగా తీసుకొన్నారు. ఉద్యోగుల్లో కొందరు వేరే మున్సిపాలిటీలకు బదిలీ అయ్యారు. ఈ విషయంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో అక్టోబర్ 13న ఇక్కడి బాధ్యులు రాజమండ్రిలోని మున్సిపల్ ఆర్డీ దృష్టికి తీసుకెళ్లారు. ఆర్డీ ఆదేశాల మేరకు ఏపీ ఫైనాన్షియల్ కోడ్ మేరకు ఏపీ సివిల్ సర్వీసెస్ రూల్స్ 1991 ప్రకారం చర్యలు తీసుకోవాలనే ఇక్కడి అధికారులకు ఆదేశాలను ఇచ్చారు. దీంతో అడ్వాన్సులు తీసుకొన్న వారికి షోకాజ్ నోటీసులు వెళ్లాయి. ఆరుగురిలో ఒకరిద్దరు సొమ్ములు జమ చేసినట్టు సమాచారం. ఇంతకాలం అడ్వాన్సు తాలూకా బిల్లులు, అవి పోను మిగిలిన సొమ్ములు చెల్లించకుండా ఉండటానికి వివరణ పత్రాలు సమర్పించడంతో పాటు సొమ్ములు చెల్లించాల్సి ఉంది. ఈమేరకు చార్జిషీట్ చేసే అవకాశాలు ఉంటాయి. లేకుంటే వేతనాలను నిలుపుదల చేసి రికవరీ చేయడం కాని, లేదంటే ఉద్యోగ విరమణానంతర ప్రయోజనాల సొమ్ము నుంచి రికవరీ చేసుకొనే వీలుంటుంది. అయితే సొమ్ములు చెల్లించకుండా ఉండే అవకాశం సంబంధిత ఉద్యోగులకు ఎంత మాత్రం లేదు.

స్కామ్ అంటూ ప్రచారం

పచ్చమీడియా చానల్‌లో ప్రభుత్వ ఉద్యోగులను దొంగలుగా అభివర్ణిస్తూ, స్కామ్ అంటూ తప్పుడు కథనాలు ప్రసారమయ్యాయి. వాస్తవాలు తెలుసుకోకుండా జరిగిన ఈ ప్రసారంలో సదరు మీడియాకు మున్సిపాలిటీ నుంచి సమాచారం ఎవరిచ్చారనే కోణంలో విషయ సేకరణ జరుగుతోంది.

షోకాజ్ నోటీసులు ఇచ్చాం

ప్రభుత్వ సొమ్ము ఒక్క రూపాయి కూడా పోనివ్వమని మున్సిపల్ కమిషనర్ శామ్యూల్ అన్నారు. అడ్వాన్సులు తీసుకున్నప్పుడు ఖర్చులు పోను సకాలంలో మిగిలిన సొమ్ము జమ చేయాలని, చాలా కాలమైనా అది జమకాలేదన్నారు. బాధ్యులకు షోకాజ్ నోటీసులు ఇచ్చామని, వివరణతో పాటు సొమ్ములు జమ చేయాలని, లేకుంటే తదుపరి చర్యలుంటాయని అన్నారు.

రికవరీ చేస్తాం

కోవిడ్ సమయంలో గూడెం మున్సిపాలిటీలో పనిచేసే ఆరుగురు ఉద్యోగులు కోవిడ్ సేవల ఖర్చుల కోసం అడ్వాన్సులు తీసుకున్నారు. బిల్లులు, చెల్లింపులు కొన్ని మిగిలి ఉన్నాయి. ఈ విషయంపై ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో సీసీఏ రూల్స్ ప్రకారం చర్యలుంటాయి. ఒక అకౌంట్స్ అధికారిని నియమించి సొమ్ములు రాబడతాం. ప్రభుత్వ సొమ్ము ఎక్కడికీ పోదు. దీనికి సంబంధించి సంబంధిత ఉద్యోగులకు అక్కడి కమిషనర్ షోకాజ్ నోటీసులు ఇచ్చారు. సొమ్ములు చెల్లించకపోతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు ఉంటాయి. ఉద్యోగుల ఉద్యోగ విరమణానంతరం ఆర్థిక ప్రయోజనాలపై కూడా ప్రభావం ఉంటుంది. వారం రోజుల్లో ఈ వ్యవహారానికి సంబంధించి ప్రక్రియ పూర్తవుతుంది. అంతే కాని ఇది ఎంతమాత్రం స్కాం కాదు.

– సత్యనారాయణ, మున్సిపల్ ఆర్డీ, రాజమహేంద్రవరం

‘లింగపాలెం’లో కలకలం

- పాడి రైతులపై సంగం డెయిరీ సిబ్బంది దాడి
- గుంటూరు జిల్లా వడ్లమూడిలో ఘటన

లింగపాలెం: లింగపాలెం మండలానికి చెందిన పాడి రైతులపై సంగం డెయిరీ సిబ్బంది దాడి చేయడంతో స్థానికంగా కలకలం రేగింది. మండలంలోని రంగాపురం గ్రామానికి చెందిన ద్వారకా మిల్క్ సెంటర్ యజమాని, టీడీపీ నాయకుడు, సర్పంచ్ ముసునూరి రాముతోపాటు నరసన్నపాలెం గ్రామ టీడీపీ నాయకుడు, సర్పంచ్ కూరపాటి రత్తయ్య మరికొందరు రైతులపై గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడిలో సంగం డెయిరీ సిబ్బంది బుధవారం దాడి చేశారు. రైతుల పాలకు రావాల్సిన రూ.50 లక్షల బోనస్ సొమ్ముల కోసం వెళ్లగా తమపై దాడి చేశారని బాధితులు వాపోతున్నారు. ద్వారకా మిల్క్ పాయింట్‌తో గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి సంగం డెయిరీ పాలు పోసేందుకు ఒప్పందం కుదుర్చుకుందని, ఈ మేరకు పాలు పోసినట్టు సర్పంచ్‌లు రాము, రత్తయ్య, రైతులు తెలిపారు. అయితే తమకు బోనస్ రూపంలో సుమారు రూ.50 లక్షల మేర చెల్లించాల్సి ఉన్నా కాలయాపన చేస్తుండటంతో అక్కడకు వెళ్లామని అన్నారు. టీడీపీ నాయకుడు, పొన్నూరు మాజీ ఎమ్మెల్యే ధూళిపాల నరేంద్రకు చెందిన సంగం డెయిరీ సిబ్బంది తమపై దాడి చేయడంతో పాటు కార్లను ధ్వంసం చేశారని అన్నారు. గాయాలపాలైన సర్పంచ్‌లు, రైతులు అక్కడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, చేబ్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన రైతులను అదే పార్టీ నాయకుడికి చెందిన కంపెనీ సిబ్బంది దాడి చేయడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

ప్రత్యేక ఓటరు నమోదుపై విస్తృత ప్రచారం

ఏలూరు(మెట్రో): జిల్లాలోని ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వచ్చేనెల 2,3 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంపై పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని సంబంధిత అధికారులకు, రాజకీయ పక్షాల ప్రతినిధులకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం ఓటరు నమోదు, ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాలు తదితర అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పక్షాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ ఓటుహక్కు ఉండేలా చూడాలన్నారు. ప్రత్యేక ఓటరు నమోదు రోజుల్లో ప్రతి పోలింగ్ స్టేషన్లలో బీఎల్ఓలు, బీఎల్ఏలు ఉండాలన్నారు. ఓటరు నమోదు ప్రత్యేక కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కలిగించేందుకు జనసాంద్రత గల ప్రాంతాలు, టీ దుకాణాలు వద్ద బ్యానర్లు ఏర్పాటుచేయాలని సూచించారు. స్థానిక కేబుల్ ప్రసారాల ద్వారా ప్రచారం కల్పించాలన్నారు. అలాగే ఈపీ రేషియో, జనరల్ రేషియాలో వ్యత్యాసం లేకుండా పరిశీలించాలన్నారు. జిల్లాలో చేపట్టిన తొలిదశ ఓటు యంత్రాల తనిఖీ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, కేఎస్ సాంబ (వైఎస్సార్‌సీపీ), దేవరపల్లి రత్నబాబు (బీఎస్పీ), యం.దశరథ్‌కుమార్ (ఆమ్‌ఆద్మీ), భాను ప్రసాద్ (టీడీపీ), కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్న దొర పాల్గొన్నారు.

అసైన్డ్, లంక రైతులకు మంచిరోజులు

- జిల్లాలో 823 ఎకరాల్లో లంక భూములు.. 1,181 మందికి పత్రాలు సిద్ధం
- 249 ఎకరాల్లో అసైన్డ్ భూములు.. 583 మంది లబ్ధిదారులకు హక్కులు
- జిల్లాలో కొనసాగుతున్న సర్వే.. హక్కు పత్రాల పంపిణీకి ఏర్పాట్లు


భీమవరం మండలం కొమరాడలో అసైన్డ్ భూములు

సాక్షి, భీమవరం: జిల్లాలోని అసైన్డ్, లంక భూముల రైతులకు మంచిరోజులు వచ్చాయి. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగుచేసుకుంటున్నా వాటిపై ఎటువంటి హక్కులు లేకపోవడంతో భూములు కలిగిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దశాబ్దాల పాటు తమ స్వాధీనంలోనే ఉన్నా సాగుచేసుకుంటూ ప్రభుత్వానికి నీటితీరువా వంటి పన్నులు చెల్లిస్తున్నా ఆయా భూములను ఇతరులకు విక్రయించడం, బదలాయించడానికి ఇప్పటివరకు వారికి ఎటువంటి హక్కు లేదు. కనీసం బ్యాంకుల్లో రుణాలు తీసుకోవడానికి, పిల్లల పెళ్లికానుక కింద రిజిస్ట్రేషన్ చేయడానికి అవకాశం లేకపోవడంతో అసైన్డ్, లంక భూములు కలిగిన రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నో ప్రభుత్వాలను అయా భూములపై తమకు పూర్తి హక్కు కల్పించాలని వేడుకున్నా ఫలితం లేకపోయింది. జిల్లాలోని ఆచంట, పెనుగొండ, యలమంచిలి మండలాల్లో లంక భూములు, 20 మండలాల పరిధిలో వేలాది ఎకరాలు అసైన్డ్ భూములున్నా వాటిలో కేవలం పంట పండించుకోడానికి మినహా ఇతరత్రా హక్కులు లేకుండా పోయాయి. అయితే కొంత మంది రైతులు అత్యవసర పరిస్థితుల్లో తక్కువ ధరకే అసైన్డ్, లంక భూములను అనధికారికంగా విక్రయాలు చేసుకున్నారు.

సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లంక, అసైన్డ్ భూములు గత 20 ఏళ్లుగా స్వాధీనంలో ఉన్న రైతులకు పూర్తి హక్కులతో పత్రాలు అందించాలని ఆదేశించడంతో జిల్లాలో సర్వే జరుగుతోంది. దీంతో జిల్లాలోని పెనుగొండ, ఆచంట, యలమంచిలి మండలాల్లోని లంక భూములు 823 ఎకరాలను గుర్తించి వాటిని సుమారు 1,181 మంది లబ్ధిదారులకు పత్రాలు అందించేందుకు సిద్ధం చేశారు. అలాగే 20 మండలాల్లోని 53 గ్రామాల్లో సర్వే చేసి 583 మంది లబ్ధిదారులకు సుమారు 249 ఎకరాల అసైన్డ్ భూములకు హక్కుపత్రాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీటితో పాటు ఇనామ్ భూమి 88 సెంట్లు ఇద్దరు లబ్ధిదారులకు, ఎస్సీ కార్పొరేషన్ భూములు ఆకివీడు మండలం గుమ్ములూరులో 33 మందికి పత్రాలు ఇవ్వడానికి సుమారు 16 ఎకరాలు సిద్ధం చేయగా ఎస్సీ ఏరియాలో శ్మశానవాటికలు, కమ్యూనిటీ హాల్స్‌కు 44 ఎకరాలు స్వాధీనం చేస్తున్నారు. మిలిగిన గ్రామాల్లో ఇంకా సర్వే చేయాల్సి ఉంది. ఇప్పటికే అనుభవిస్తున్న భూముల్లో సంపూర్ణ హక్కులు పొందనుండడంతో ఆయా రైతులు, గ్రామాల్లోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



20 ఏళ్ల క్రితం మా నాన్నపేరిట సీ క్లాస్ పట్టా వచ్చింది. అప్పటి నుంచి భూమి సాగు చేసుకుంటున్నాం. ప్రస్తుతం ఈ భూమికి ప్రభుత్వం డీ క్లాస్ పట్టా ఇవ్వనుండటంతో మా పేరిట ఆన్‌లైన్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయం చాలా సంతోషాన్ని కలిగిస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు.

– తిరుమాని ఆదికృష్ణ, యలమంచిలి

బ్యాంకు రుణాలకు అవకాశం



మా తండ్రి అన్నదమ్ములు ముగ్గురి పేరిట 3 ఎకరాల భూమి ఇచ్చారు. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నా భూమి మా పేరున లేకపోవడంతో కనీసం బ్యాంకు అప్పు కూడా ఇచ్చేది కాదు. ప్రస్తుత ప్రభుత్వం మా పేరిట పట్టాలు ఇవ్వడంతో, భూమితో పాటు బ్యాంకు రుణాలు వచ్చే అవకాశం ఉంది.

– చింతా నాగరాజు, అబ్బిరాజుపాలెం

1,430 మంది రైతులకు లబ్ధి



జిల్లాలోని అసైన్డ్, లంక భూముల సర్వే జరుగుతోంది. ఇప్పటికే 53 గ్రామాల్లో సర్వే చేసి 583 మంది లబ్ధిదారులకు 249 ఎకరాల అసైన్డ్ భూమి, మూడు మండలాల్లోని 823 ఎకరాల లంక భూమిని గుర్తించి 1,181 మందికి ఇవ్వడానికి హక్కు పత్రాలు సిద్ధం చేశాం. మిగిలిన గ్రామాల్లో సర్వే పూర్తి చేసి పత్రాలను అందిస్తాం.

– ఎస్.రామసుందర్‌రెడ్డి, జేసీ, పశ్చిమగోదావరి జిల్లా

క్లుప్తంగా

ఆర్జీయూకేటీ యోగాసన జట్టు ఎంపిక


ఎంపికైన యోగా విద్యార్థులతో అధికారులు

నూజివీడు: సౌత్‌జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల యోగాసన పోటీల్లో పాల్గొనేందుకు ఆర్జీయూకేటీ జట్టును ఎంపిక చేశారు. దీనికిగాను నూజివీడు ట్రిపుల్‌ఐటీలో నాలుగు ట్రిపుల్‌ఐటీలకు చెందిన యోగా విద్యార్థులకు పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన ఆరుగురు బాలికలు, ఆరుగురు బాలురను ఎంపిక చేశారు. ఎంపికైన 12 మందీ నూజివీడు ట్రిపుల్ ఐటీకి చెందిన వారే కావడం విశేషం. బాలుర జట్టుకు కే లక్ష్మణరావు, ఆర్ శేషసురేష్, పీ ఆదిశంకరరెడ్డి, టీ అశోక్, పీ సురేష్, పీ భరత్ కుమార్ ఎంపికయ్యారు. బాలికల జట్టుకు ఏ ప్రవీణ, కే సౌమ్య, ఎస్ వెంకట భార్గవి, ఎస్.ప్రమీల, పీ ప్రియాంక, ఏ నిఖిల ఎంపికయ్యారు. వీరందరూ డిసెంబర్ 1వ తేదీ నుంచి 4వ తేదీ వరకు తమిళనాడు రాష్ట్రంలోని తిరుచురాపల్లిలోని అన్నా యూనివర్శిటీలో నిర్వహించే యోగా పోటీల్లో పాల్గొననున్నారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం డైరెక్టర్ ఆచార్య జీవీఆర్ శ్రీనివాసరావు, ఏవో ప్రదీప్, డీన్ అకడమిక్స్ లక్ష్మణరావు తదితరులు అభినందించారు.

వ్యక్తి అరెస్ట్

పోలవరం రూరల్: వింజరం గ్రామ సమీపంలో ఐదు లీటర్ల సారా కలిగి ఉన్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. మెత్తాపుకోట నుంచి ఐదు లీటర్ల సారాను మండకం పొట్టి దొర అనే వ్యక్తి తరలిస్తుండగా బుధవారం అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చింతమనేనిపై విచారణకు ఎస్పీ ఆదేశం

దెందులూరు/ఏలూరు టౌన్: పెదవేగి తహసీల్దార్ నల్లమిల్లి నాగరాజుపై మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ దౌర్జన్యం చేసి కులం పేరుతో దూషించిన ఘటనపై దళిత సంఘాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్పీ మేరీ ప్రశాంతి బుధవారం విచారణకు ఆదేశించారు. నూజివీడు డీఎస్పీని విచారణ అధికారిగా ఎస్పీ నియమించారు. సంఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేసి నివేదిక అందించాలని ఆదేశించారు. దళిత సంఘాల ఆందోళన, ఫిర్యాదు మేరకు చింతమనేని కులదూషణపై ఎస్పీ విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నామని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు తేరా ఆనంద్, జడ్పీ వైస్ చైర్మన్ పీ విజయ్‌కుమార్, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ మెంబర్, దెందులూరు జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి గొల్ల కిరణ్ అన్నారు.

భార్య దూరమైందని.. భర్త బలవన్మరణం

టి.నరసాపురం: భార్య మృతితో మనస్తాపానికి గురైన ఓ భర్త ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. బొర్రంపాలెం గ్రామానికి చెందిన పెనుబోతు నాగబాబు (44) భార్య అనారోగ్యంతో గత కొంతకాలం క్రితం మృతి చెందింది. అప్పటి నుంచి మనస్తాపానికి గురై మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి తన ఇంట్లో దూలానికి కండువాతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని బావ నాగరాజు ఫిర్యాదు మేరకు ఎస్సై బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి, నాగబాబు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

స్వాతంత్ర్య సమరంలో గిరిజనుల త్యాగాలు అజరామరం


గిరిజన సమరయోధుల వారసులను సన్మానిస్తున్న బాలరాజు, సూర్యతేజ


కేఆర్‌పురం ఐటీడీఏలో సంప్రదాయ నృత్యాలు చేస్తున్న గిరిజనులు

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఐటీడీఏ పీఓ సూర్యతేజ
- కేఆర్‌పురంలో ఘనంగా జన్ జాతీయ గౌరవ్ దివస్

బుట్టాయగూడెం: దేశం కోసం గిరిజన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని వారి వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్లేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. కేఆర్‌పురం ఐటీడీఏలో జన్ జాతీయ గౌరవ్ దివస్(ట్రైబల్ ప్రైడ్ డే) కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులు తమ సాంస్కృతిక మూలాలను అర్థం చేసుకుని ఐక్యతను పాటించాలన్నారు. బ్రిటిష్ వలస ప్రభుత్వ దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన గిరిజన నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా అన్నారు. అలాగే గిరిజనుడు కారుకొండ సుబ్బారెడ్డి కూడా బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన వీరుడన్నారు. వీరి త్యాగాలను ప్రతి ఒక్కరూ భావితరాలకు అర్థమయ్యేలా కృషి చెయ్యాలని అన్నారు. ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం. సూర్యతేజ మాట్లాడుతూ బ్రిటిష్ వలసవాద, దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించిన గిరిజన యోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని స్వాతంత్ర్య సమరయోధుల స్మారకార్థం నవంబర్ 15వ తేదీని జన్ జాతీయ గౌరవ్ దివస్‌గా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ సందర్భంగా వారంపాటు వేడుకలు నిర్వహించనున్నామన్నారు. అనంతరం స్వాతంత్ర్య సమరయోధుల వారసులు పూరెం సీతారామయ్య, కారుకొండ అబ్బయ్యరెడ్డి, నల్లపు లచ్చిరెడ్డి, వేట్ల చెల్లమ్మ తదితరులను ఘనంగా సన్మానించి నగదు బహుమతులను అందజేశారు. అదేవిధంగా ట్రైబల్ ప్రైడ్ డే కార్యక్రమంలో భాగంగా పాఠశాలల్లో ఆర్చరీ, జావెలిన్ త్రో, వాలీబాల్, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. వీరిని రాష్ట్ర స్థాయి జట్లకు ఎంపికయ్యేలా విశాఖపట్టణంలో తర్ఫీదునివ్వనున్నారు. తొలుత ఎమ్మెల్యే, ఐటీడీఏ పీఓ, ప్రజాప్రతినిధులకు ఘన స్వాగతం పలికారు. అలాగే గిరిజన సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్‌లు, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు పాల్గొన్నారు.

గడపగడపకు సంక్షేమం


జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం 22వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా


ఏలూరు టౌన్: ఏలూరు 8వ డివిజన్‌లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ దివ్యాంగుడికి సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

గోఆధారిత ఉత్పత్తుల స్టాల్ ప్రారంభం

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ద్వారకాతిరుమలేశ గోఆధారిత ఉత్పత్తుల స్టాల్‌ను దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు బుధవారం ప్రారంభించారు. ముందుగా పురోహితులు స్టాల్ వద్ద చినవెంకన్న చిత్రపటాన్ని ఉంచి పూజాదికాలను నిర్వహించారు. అనంతరం ఈఓ త్రినాథరావు జ్యోతి ప్రజ్వలన చేసి స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు స్టాల్ యజమాని చేబోలు శరణ్య రాజేష్ శ్రీవారి మెమెంటోను అందించారు. అనంతరం ఈఓ మాట్లాడుతూ శ్రీవారి గోవుల పేడ, మూత్రం ద్వారా తయారయ్యే ఈ ఉత్పత్తులను భక్తులకు అందుబాటులో ఉంచాలన్నారు. వాటిని దేవస్థానం సూచించిన ధరలకు మాత్రమే విక్రయించాలని సూచించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ స్టాల్‌లో మొత్తం 27 రకాల గోఆధారిత ఉత్పత్తులను భక్తులకు అందుబాటులో ఉంచామన్నారు. ఆవు పిడకలు, పంచగవ్య షాంపు, గో విభూది, గో మూత్ర ఫినాయిల్, ఆవు పాలకోవా, గో విభూది, పంచగవ్య సబ్బు, పళ్లపొడి, పంచగవ్య ప్రమిద ఇలా అన్నింటిని సహజసిద్ధంగా తయారు చేస్తున్నట్టు చెప్పారు.

లారీ డ్రైవర్‌కు ఏడాది జైలు శిక్ష

నూజివీడు: లారీని అతివేగంగా, నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన నేరానికి డ్రైవర్‌కు ఒక నెల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కృష్ణా జిల్లా బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌కు చెందిన పట్నపు కృష్ణ 2021 జులై 11న రాత్రి 8 గంటల సమయంలో నూజివీడు నుంచి మోటర్‌సైకిల్‌పై హనుమాన్ జంక్షన్ వెళుతుండగా తుక్కులూరు వద్ద వెనుక నుంచి లారీ మోటర్ సైకిల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కృష్ణ తీవ్రంగా గాయపడగా, అతనిని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నిందితుడు డ్రైవర్ కాకర రాయప్ప నూజివీడు రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. బుధవారం ఈ కేసు విచారణలో నిందితుడి నేరం రుజువు కావడంతో అతనికి ఏడాది జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

హ్యాండ్‌బాల్ జాతీయ పోటీలకు ఎంపిక


విద్యార్థిని సాయిలహరితో పాఠశాల ఉపాధ్యాయులు

కామవరపుకోట: జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు కామవరపుకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని బొల్లిబోయిన సాయిలహరి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రామసుందరి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా పడమట జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో తమ పాఠశాలకు చెందిన సాయి లహరి విశేష ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థినికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు తూంపాటి బాబురావు, గుడిదల శ్యామలాదేవిలను హెచ్ఎం రామసుందరి, విద్యా కమిటీ చైర్మన్ పండు జగదీష్ గ్రామస్తులు అభినందించారు.

ఎకో సెన్సిటివ్ జోన్ పరిధి పెంపు సరికాదు

- భీమడోలు సదస్సులో కొల్లేరువాసుల మొర
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళతామన్న అధికారులు


భీమడోలు సదస్సులో మాట్లాడుతున్న డీఎఫ్‌వో ఎస్.రవిశంకర్‌రెడ్డి

భీమడోలు: కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య పరిరక్షణే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఎకో సెన్సిటివ్ జోన్ (సున్నిత పర్యావరణ ప్రాంతం)ను ప్రతిపాదించిందని, దీనిపై కొల్లేరులోని ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలను తెలియజేసేందుకు అవగాహన సదస్సులను నిర్వహిస్తున్నామని జిల్లా వన్యప్రాణుల విభాగం డీఎఫ్‌వో ఎస్.రవిశంకర్ రెడ్డి చెప్పారు. భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో బుధవారం కొల్లేరు వన్యప్రాణుల అభయారణ్య పరిరక్షణ, సరిహద్దుల గుర్తింపు కోసం సమగ్ర ప్రతిపాదనలపై మండల స్థాయిలో ప్రజాప్రతినిధులు, ప్రజల అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ ఎం.ఇందిరాగాంధీ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎఫ్‌వో ఎస్.రవిశంకర్ రెడ్డి మాట్లాడుతూ కొల్లేరును పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం కొల్లేరు పరిధిని 10 కిలోమీటర్ల మేర పెంచుతూ ప్రతిపాదనలు చేసిందన్నారు. ఈ క్రమంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ అభిప్రాయాలు, అభ్యంతరాలను తెలియజేస్తే వాటిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు నివేదిస్తామన్నారు. ఎకో సెన్సిటివ్ జోన్ పరిధిని పెంచడం ద్వారా భవిష్యత్తులో కొల్లేరులో 26 అంశాలపై ముందుగా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. కొల్లేరు ఆపరేషన్ తర్వాత కొల్లేరులో అక్రమంగా 10 వేల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారన్నారు. ఎంపీపీ కనమాల రామయ్య, రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ కొల్లేరు అభయారణ్యం పరిధిలోని కాంటూరును కుదించాలని దశాబ్దాలుగా వేడుకుంటున్నా ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు దిగజారిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అవగాహన సదస్సులను గ్రామ స్థాయిలో నిర్వహించి కొల్లేరు వాసుల అభిప్రాయాలను తెలుసుకోవాలని కోరారు. 10 కిలోమీటర్ల ప్రతిపాదన కొల్లేరు ప్రాంత వాసులకు పూర్తిగా విరుద్ధమన్నారు. ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, ఎఫ్ఎస్‌వో పాపారత్నం, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారులు, కొల్లేరు వాసులు, నాయకులు పాల్గొన్నారు.

కోడిపుంజులు అపహరించిన నలుగురి అరెస్టు

నూజివీడు: పాతరావిచర్లలో ఓ ఇంటి యజమానిని బెదిరించి కోడిపుంజులను అపహరించిన కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ ఈడే అశోక్‌కుమార్ చెప్పారు. నూజివీడు రూరల్ స్టేషన్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో కేసు వివరాలను డీఎస్పీ వెల్లడించారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం సుద్దపల్లికి చెందిన తురకా విఘ్నేష్, గుంజి సుబ్బారావు, గుంజి వెంకటేష్ ఈ నెల ఒకటో తేదీ అర్ధరాత్రి కోడిపుంజులు పెంచుతున్న దొడ్డి వద్దకు వెళ్లి యజమాని మెతుకుమల్లి శ్రీనివాసరావును కత్తితో బెదిరించి కోడిపుంజులను అపహరించారు. సెల్‌ఫోన్ టవర్ లోకేషన్ ఆధారంగా వీరిని పట్టుకున్నారు. రూరల్ సీఐ బాలసురేష్ బాబు ఆధ్వర్యంలో రెండు స్పెషల్ టీమ్‌లను ఏర్పాటు చేసి సెల్‌ఫోన్ నంబర్ల ఆధారంగా టవర్ లోకేషన్‌లను తనిఖీ చేస్తూ కచ్చితమైన ఆధారంతో బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుల వద్ద నుంచి 8 కోడి పుంజులను, స్కూటీ, నేరం చేయడానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ప్రత్యేక ప్రతిభ కనబరిచిన ఏఎస్సై సంపత్, హెడ్‌కానిస్టేబుల్స్ విజయబాబు, బాలరమేష్, కానిస్టేబుల్స్ వాసుదేవరావు, చక్రవర్తి, భోగేశ్వరరావు, శివనారాయణ, సతీష్ కుమార్, ఉదయ్‌కిరణ్, శ్రీనులకు డీఎస్పీ రివార్డులను అందజేశారు. సీఐ బాల సురేష్‌బాబు, ఎస్ఐ తలారి రామకృష్ణ పాల్గొన్నారు.

ఎద్దు దాడిలో వృద్ధురాలి మృతి

ఏలూరు టౌన్: ఏలూరు తంగెళ్లమూడిలో ఒక ఎద్దు దాడిలో గాయాలపాలైన ఓ వృద్ధురాలు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. తంగెళ్లమూడికి చెందిన కే.సోమమ్మ (70) మంగళవారం రాత్రి రోడ్డుపైకి రాగా, ఒక ఎద్దు అప్పటికే ఐదుగురిపై దాడి చేసింది. అలాగే వృద్ధురాలిపైనా దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెను ఏలూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విజయవాడ తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె బుధవారం మృతి చెందింది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ఖననం చేసిన మృతదేహానికి నేడు పోస్టుమార్టం

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ కమ్మరగూడేనికి చెందిన కొయ్యే విజయలక్ష్మి (27) అనే వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అన్నదేవరపేటకు చెందిన కొయ్యే విజయలక్ష్మికి కమ్మరగూడానికి చెందిన కొయ్యే చిన్నతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు మగ సంతానం. ఇటీవల చిన్నకు వేరొక మహిళతో పరిచయం ఏర్పడింది. ఈ విషయమై భార్యాభర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్థలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఈ నెల 12న చిన్న రాత్రి సమయంలో బయటకు వెళ్లాడు. భార్య ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో మనస్తాపానికి గురై ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. చిన్న రాత్రి తిరిగి ఇంటికి వచ్చి తలుపులు కొట్టినా తీయకపోవడంతో కిటికీ బద్దలు కొట్టి లోపలికి వెళ్లి చూడగా, విజయలక్ష్మి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఉండటాన్ని గమనించి వెంటనే ఆమెను పోలవరం వైద్యశాలకు తీసుకువెళ్లాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విజయలక్ష్మి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు 13వ తేదీ ఉదయం చేరుకుని మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే విజయలక్ష్మి మృతిపై కుటుంబ సభ్యులకు అనుమానం రావడంతో గొంతు వెంకటేశ్వరరావు బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలవరం సీఐ కె.విజయబాబు పరిశీలించి ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఖననం చేసిన మృతదేహానికి గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఎస్సై తెలిపారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

యలమంచిలి: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొనడంతో ఓ వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. చించినాడ పల్లిపాలెంకు చెందిన పెమ్మాడి లక్ష్మి (77) చేపలు అమ్ముకుంటూ జీవిస్తోంది. బుధవారం ఇంటికి నడుచుకుంటూ వెళుతూ రోడ్డు దాటుతుండగా పాలకొల్లు వైపు వెళుతున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన లక్ష్మి ఘటనా స్థలంలోనే మృతి చెందింది. కుమారుడు వెంకటేశ్వరరావుకు స్థానికులు సమాచారం ఇవ్వడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించినట్లు ఎస్సై జాజుల విజయ్‌నాగ ప్రసాద్ చెప్పారు. ప్రమాదానికి కారణమైన కారు స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.